# పట్టుచీరెలూ - పుట్టింటివాళ్ళూ

''ఎక్కడిదా పట్టుచీరె?'' అనడిగాడు రామనాథం ఆఫీసునుండి వస్తూనే. డ్రెస్సింగ్ టేబిల్ ముందు నిలబడి, విప్పిన పట్టుచీరెను భుజాన పరుచుకుని తనకెలా నప్పిందో పరిశీలించుకుంటున్న భార్యను చూడగానే అనుమానమొచ్చింది అతనికి.

''నాన్న తెచ్చాడు'' అందామె. స్వప్నలోకం నుండి ఇహానికవతరించినట్టు చీనీ చీనాంబరాల మల్టీకలర్ పిక్చర్ చూస్తోందామె. భర్త అడిగిన నీరసమైన ప్రశ్నతో ఆ రంగుల కల కరిగిపోయింది.

''ఏడాయన?''

''బయటికెళ్ళారు.''

''గణపతి రాలే?''

''ఇద్దరూ కల్సే వెళ్ళారు.''

అనవసరపు ప్రశ్న వేశాననుకున్నాడు రామనాథం. కరటక దమనకులు ఒకర్ని విడిచి మరొకరుండరు మరి! రేణుక కాఫీ తీసుకొచ్చి భర్తకిస్తూ అంది. ''తమ్ముడు వారం పదిరోజుల్లో మన డబ్బు వాపసు చేస్తానని అన్నాడు. మనం ఇల్లు కట్టుకుంటున్న సంగతి చెప్పాను. 'సంతోషం అమ్మాయి! సమయానికి మిమ్మల్ని ఆదుకున్నట్టవుతుంది' అన్నాడు నాన్న. మధ్యాహ్నం మేం ముగ్గురం వెళ్లి ఇల్లు చూసి వచ్చాం. 'క్యూరింగ్ సరిగ్గా చేయడం లేదే అమ్మాయి!' అన్నాడాయన.''

''మరి తానుండి ఆ వ్యవహారమంతా సూపర్‌వైజు చేస్తాననలే?''

''అనకేం, అన్నారు. అయితే ఆయనకెక్కడ వెసులుబాటుంది. తమ్ముడు బిజినెస్ పనులమీద తిరుగుతుంటే నాన్న ఆఫీసులో కూర్చోవాల్సివస్తోంది. 'ఎక్కడకూ రావటానికి తీరుబాటుండటం లేదే అమ్మడూ! నిన్ను చూడాలని ఎంతకాలంనుండో కొట్టుకుపోతున్నాను. ఇప్పటికి వీలయింది' అని ఆయన ఎంత ఇదయిపోయాడు.''

''ఆహఁ'' అని పేపరులో తలదూర్చాడు రామనాథం. పని మనిషి రావడంతో రేణుకకు భర్తతో సంభాషణ కొనసాగించే అవకాశం దొరకలేదు.

రామనాథం పేపరు చూస్తున్నాడు కాని, అతని దృష్టి పేపరుమీద లేదు. మామగారు పట్టుచీరె తెచ్చాడనంగానే, నిజానికి వచ్చాడనంగానే - ఎందుకంటే, ఆయన వట్టి చేతులతో ఎప్పుడూ రాడు,

పట్టుచీరె లేకుండా - అతనికి దిగులు పట్టుకుంది. భార్య పుట్టింటి వారు తెచ్చే పట్టుచీరలంటే ఎలర్జీ అతనికి. ప్రాణంలేని పట్టుచీరెలపట్ల అతనికున్న కోపానికో చరిత్ర ఉంది.

★ ★ ★

బావమరిది గణపతి ఎలాగో చావుతప్పి కన్ను లొట్టపోయినట్లు గ్రాడ్యుయేషను పూర్తిచేసి, రికామీగా బజార్లు సర్వే చేస్తూ హాయిగా కాలం గడుపుతూండడం చూసిన మామగారు ఆదివరాహమూర్తికి కడుపులో దేవినట్లయింది. ''అట్లా బజార్లపడి, అడ్డగాడిదలా తిరక్కపోతే, ఏదన్నా ఉద్యోగం చూసుకోరాదు'' అన్నాడాయన.

''నాకెవరికిందా పనిచేయటం ఇష్టంలేదు నాన్నా! స్వంతంగా బిజినెస్ పెట్టాలనుకుంటున్నాను'' అన్నాడతను.

''ఏం బిజినెస్?''

''ఇంకా నిర్ణయించుకోలేదు.''

''బిజినెస్ అంటే మాటలా? పెట్టుబడి కావద్దూ?''

''అయినవాళ్ళందరూ తలో చెయ్యి వేస్తే, నాలుగు నాళ్ళలో తీర్చమూ?''

ఈ సంభాషణంతా తాము దీపావళికి ఆహ్వానంమీద మామగారింటికి వెళ్ళినపుడు తమ ఎదుటే జరిగింది. తన తోడల్లుడు, తనకంటే పెద్దవాడు మొదట్లో సణిగాడు, 'నా దగ్గరేం డబ్బు లేద'ని. అయితే ఆయన భార్య పుట్టింటివారి భారీ పట్టుచీరె సంరంభంలో పడిపోయి అతన్నేం మాట్లాడనివ్వలేదు. 'చేతనయిన సాయం చేస్తా'నని మాట ఇవ్వాల్సివచ్చింది శంకర్రావుకు. నిజానికి రామనాథం రికామీగా తిరిగే ఆ పిల్లవాడికి మొదట్లో సాయం చెయ్యడం తన బాధ్యతగా భావించాడు. అలా మొదటిసారి అప్పివ్వడంలో అతని భార్య రేణుక పాత్ర చాల అల్పమైందే.

అప్పు తీసుకున్న తర్వాత మళ్ళీ ముఖం చూపించలేదు గణపతిగాని, ఆదివరాహమూర్తిగాని. రెండో సారి పట్టుచీరె తీసుకొచ్చినప్పుడే రామనాథానికి అనుమానమొచ్చింది. సాయంత్రం ఆఫీసునుండి ఇంటికొచ్చేటప్పటికి మూర్తీభవించిన శాంతమూర్తుల్లా కూర్చునున్న రెండు శాల్తీలను చూడగానే అతను పొరపడ్డాడు, తను అప్పు ఇచ్చిన డబ్బు వాపసు చేయడానికి వచ్చారేమోనని.

''ఐదున్నరకే వస్తావని అమ్మాయి చెప్పింది. ఏడున్నరయిపోయింది. ఇంకెంతసేపటికి వస్తావోనని ఎదురుచూస్తున్నాం'' అన్నాడు మామగారు ఆదివరాహమూర్తి.

''పని తగిలి వుండిపోవాల్సి వచ్చింది'' అన్నాడు రామనాథం సోఫాలో కూర్చుని షూ లేస్ విప్పుకుంటూ.

మాటలు విని, వంటింట్లోనుండి నవ్వు మొహంతో వచ్చింది శ్రీమతి రేణుక కాఫీ కప్పుతో.

''నాన్నా, తమ్ముడూ మధ్యాహ్నమే వచ్చారు. సాయంత్రమే వెళ్లిపోతామన్నారు. నేనే బలవంతం చేసి ఆపాను'' అంది రేణుక.

''అయ్యో! మధ్యాహ్నమే వెళ్ళిపోవటమేం. రెండు రోజులుండకుంటే మీ అమ్మాయి బాధపడి పోతుంది. అక్కడంత ముంచుకుపోయే పనులేమున్నాయిగనక. ఎలాగో వచ్చారు, వెళ్లరుగానిలెండి'' అన్నాడు రామనాథం - జేబులోనుండి సిగరెట్టు పెట్టె, అగ్గిపెట్టె తీసి, సిగరెట్టు వెలిగించి, వాటిని టీపాయ్ మీద పెడ్తూ.

మామగారు ఆ సిగరెట్టు పెట్టె తీసి, ఓ సిగరెట్టు వెలిగించి, గుప్పిట ముడిచి ఓ దమ్ములాగి తాము వచ్చిన కారణం వివరించసాగాడు. ''లేదోయ్ రెండురోజులుండే తీరిక లేదు. సరే ఇహ రాత్రికేం వెళ్తాంగాని, పొద్దున్నే వెళ్ళాలి. మన గణపతి బిజినెస్ బాగా నడుస్తోంది. వాడు అక్కడ లేకపోతే పని జరగదు. బిజినెస్‌కి మదుపు పెట్టాంగాని, వర్కింగ్ కాపిటల్‌కి ఇబ్బందిగా ఉందోయ్. ఓ ఇరవై వేలు ఉంటే సర్దుతావేమోనని వచ్చాం'' అని.

'పంది వెధవ! బిజినెస్‌కి మదుపు పెట్టాడట. తనూ, శంకర్రావూ కలిసి ఇచ్చిన డెబ్బైవేలతో కాదూ వీళ్లు బిజినెస్ స్టార్ట్ చేసింది. తనేమన్నా పైస ఇచ్చాడా? మళ్ళీ తయారయాడు ఇరవై వేలకు' అనుకున్నాడు రామనాథం. కాని పైకేం మాట్లాడలేదు. లేచి స్నానం చేయడానికని బాత్‌రూంలోకి వెళ్ళాడు. ఎలా తన దగ్గర డబ్బు లేదని చెప్పాలా అని ఆలోచిస్తున్నాడు. డబ్బు లేదని చెప్తే శ్రీమతి ఏమంటుందో అని తికమక పడసాగాడు.

ముందు గదిలోనుండి మాటలు వినిపిస్తున్నాయి.

''డబ్బుకి అంత ఇబ్బంది పడటమెందుకు నాన్నా! ఉత్తరం రాయాల్సింది. ఏదో చూసి పంపే వాళ్ళం'' అంటోంది రేణుక.

''డబ్బుదేముందే అమ్మాయి! అక్కడే సర్దుబాటు చేసుకోవచ్చు. లాభాలూ బాగానే వస్తున్నాయి. మళ్ళీ అవి కాపిటల్‌గా పెట్టటంతో పై పెట్టుబడికి తడుముకోవాల్సి వస్తోంది. ముష్టి ఇరవైవేలు ఎంతనీ? ఎవడినడిగినా ఇస్తాడు. పరాయివాడిని అప్పు అడిగి చులకనవటమెందుకని ఇలా వచ్చాం. మనలో మనమయితే గుట్టు చప్పుడు కాకుండా ఉంటుందనే ఉద్దేశ్యంతోనే వచ్చాం'' అంటున్నాడు ఆదివరాహమూర్తి.

''అది కాదే అక్కా! మన బిజినెస్ చూసి అందరూ మన కన్సరన్‌లో పెట్టుబడి పెట్టి పార్ట్‌నర్‌లవ్వాలని ఉవ్విళ్ళూరుతున్నారు. నాకూ బయటవాడికి లాభాలు పంచాలంటే కష్టమనిపించింది. బావగారెలాగో ముప్పైఐదువేలు పెట్టుబడి పెట్టారు. ఇంకో ఇరవైవేలు ఇస్తే ఆయనకే పార్ట్‌నర్‌షిప్ ఇద్దామని వుంది. పెద్దబావగారూ సరేనన్నారు. ఇంత కష్టపడి బిజినెస్ చేస్తున్నాను. బయటివాడు తింటే నాకేం లాభం? నువ్వో రూపాయి తిన్నా పోన్లే మా అక్కే గదా అనిపిస్తుంది నాకు. అదే పరాయివాడు తింటే ఎలా వుంటుందో నువ్వే ఆలోచించు.''

''అయినవాడివి కాబట్టి నువ్వలా అనుకుంటున్నావుగాని తమ్ముడూ, పరాయివాళ్ళు మన్ని గురించి ఎందుకాలోచిస్తార్రా! అమ్మ ఏమంది?'' అనడిగింది రేణుక.

''అసలు మీ అమ్మ ఆలోచనేనే ఇది అమ్మాయి!'అల్లుళ్ళ దగ్గర చెరి ముప్పైఐదు వేలు తీసుకున్నారు. ఆడపిల్లల సొమ్ము తినడం మంచిది కాదు. అల్లుళ్ళకు కూడా వ్యాపారంలో భాగమివ్వండి. లేకపోతే ఆ డబ్బు వడ్డీతో సహా తిరిగి ఇచ్చెయ్యండి' అని పట్టు పట్టుకు కూర్చుంది, సరే, మీరు మాత్రం నాకు పరాయివాళ్ళా? వాడెంతో మీరంత! ఆ వ్యాపారంలో వచ్చే లాభమేదో అది రూపాయిగానీ - తలో మూడోవంతూ తింటే నాకూ సంతోషం. కోడలు పరాయిపిల్ల అని కాదుగాని, ఆ పిల్ల కూడా ఆ మాటే అంది 'వదినగార్లు మాతో కలిస్తే అంతకంటే మాక్కావలసిందేం వుంది' అని'' అన్నారు ఆదివరాహమూర్తి.

బాత్‌రూంలో పళ్ళు పటపటా కొరికాడు రామనాథం. ఇచ్చిన ముప్పైఐదు వేల సంగతి ఇన్నేళ్ళనుండి ఎత్తకుండా, ఇప్పుడు మళ్ళీ అప్పుకు రావడం మంటగా ఉంది అతనికి.

''అక్కా! ఉన్న విషయం చెప్పా. దీంట్లో దాపరికాలేం లేవు. ఇహ నువ్వూ, బావగారూ ఆలోచించుకోండి. పార్ట్‌నర్‌షిప్ వద్దనుకుంటే, ఆ ముప్పైఐదు వేలూ రెండు నెలల్లో పంపిస్తా వడ్డీతో సహా. నా ఆలోచనేంటంటే మీరూ మాతో కలవండి. వచ్చే లాభాలేవో మనం మనం పంచుకోవచ్చు.'' అన్నాడు గణపతి.

''ఏడమ్మాయి! అల్లుడు బాత్‌రూంలో నుండి ఊడిపడడు'' అడిగాడు ఆదివరాహమూర్తి.

''స్నానం చేస్తున్నట్టున్నారు నాన్నా! ఆయన గంటలతరబడి స్నానం చేస్తారు'' అంది రేణుక.

'' అది మంచిదేలే అమ్మడూ! స్నానం ఆలస్యంగానూ, భోజనం తొందరగానూ చేసే వాళ్ళ ఇంట్లో లక్ష్మి తాండవమాడుతుంటుంది అని పురాణాల్లో వుంది'' అన్నాడు ఆదివరాహమూర్తి.

భోజనాలయాయి. తండ్రీ, తమ్ముడూ వచ్చారన్న ఆనందంతో రేణుకకు వళ్ళు తెలియలేదు. రకరకాల పిండివంటలు తయారు చేసింది. సుష్టుగా తిని, ఆయాసంతో సోఫాలో జారగిలబడిన శాల్తీలను చూడగానే రామనాథంకు అసూయ కలిగింది. ఇచ్చిన డబ్బుకు నీళ్ళు వదలుకున్నాడు. నాలుగేళ్ళనుండి డబ్బు విషయం ఎత్తకుండా, మళ్ళా మొహమే చూపించకుండా వున్న మామగారు, బావమరది, మళ్ళా డబ్బు అవసరమై వచ్చి తనకేదో సాయం చేస్తున్నట్టుగా పెద్ద పెద్ద మాటలు మాట్లాడడం అతనికేం నచ్చలేదు. భోజనం చేసి సిగరెట్టు ముట్టిద్దామని పెట్టె తెరిస్తే అది ఖాళీ. మామగారు వక్కపొడి నములుతూ, చివరి సిగరెట్టు గుప్పిట బిగించి దమ్ము లాగుతున్నాడు.

''అల్లుడూ! సిగరెట్లకు బయటకెళ్తావేమో. నాకీ సిగరెట్లు బాగుండలేదు. గోల్డ్ ఫ్లాక్ కింగ్ సైజు పెట్టెలు రెండు పట్టుకురా'' అన్నాడు ఆది వరాహ మూర్తి.

'డబ్బు మనది కాకపోతే నేనూ తాగుతాను ట్రిబుల్ ఫైవ్ సిగరెట్లు' అని మనసులో అనుకుని సిగరెట్లు తెచ్చుకోవటానికి చొక్కా వేసుకుని బయటకెళ్ళాడు రామనాథం.

రామనాథం తిరిగి వచ్చేటప్పటికి కరటకదమనకు లిద్దరూ ముందు గదిలో మంచాల మీద శయనించారు. మామగారికి సిగరెట్టు పెట్టెనిచ్చి, బెడ్‌రూంలోకి వెళ్ళి నడుం వాల్చాడు రామనాథం. తలుపేసి వచ్చింది శ్రీమతి.

''నాన్నా, తమ్ముడూ డబ్బు సంగతి ఎత్తితే ఉలక్కుండా పలక్కుండా కూర్చున్నారు. అదేం పెద్ద మనిషి తరహా?'' అంది నిష్ఠూరంగా రేణుక.

''ఇచ్చేవాళ్లుంటే నేనూ అడుగుతాను. మనమేం డబ్బు రాసి పోసుకు కూర్చున్నామా, వాళ్ళడగ్గానే ఇచ్చేందుకు?'' అన్నాడు రామనాథం.

''వాళ్ళేం ఊర్కే అడగలేదు. ఇంతోసి ఇరవైవేలు వాళ్ళకక్కడ దొరక్కాకాదు. ఏదో వ్యాపారంలో మనకూ వాటా యిద్దామనీ, ఆవిధంగా మనకూ సాయం చేసినట్టవుతుందనే ఉద్దేశంతోనే వచ్చారుగానీ, మనల్ని దేబిరించటానికి రాలేదు.''

'' ఈ కబుర్లు నాకు చెప్పకు. తీసుకున్న డబ్బు సంగతి ఈ నాలుగేళ్ళ నుండి మాట వరసకయినా యెత్తలేదు మీ నాన్నా, తమ్ముడూ. ఇప్పుడు డబ్బు అవసరపడి కొత్త ఎత్తు వేసుకుని వచ్చారు.''

''అసలు మా వాళ్ళంటే మీకెప్పుడూ చిన్న చూపేలేండి. కిందటేడు చెల్లిలి పెళ్ళికి మీనాన్న పదివేలు కావాలంటే ఉరుకులూ పరుగులూ పెట్టి పట్టుకెళ్ళలా మీరు?''

''చెల్లి పెళ్ళికి సాయం చెయ్యటం నా బాధ్యత. 'పదివేలు అప్పుగా ఇవ్వరా నాయనా' అని నాన్నేమీ అడగలేదే. ఇచ్చామంటే తిరిగి రాదనే అర్థం. ఆ విషయం తెల్సే ఇచ్చాం. ఇక్కడ అలా కాదే. ముప్పై ఐదువేలు అప్పని పట్టుకెళ్ళారు. దాంట్లో పైసా తీర్చకుండా ఇప్పుడు ఇరవై వేలు కావాలని వచ్చారు సిగ్గులేకుండా ఇదేం బాంకా - రాంగానే పట్టుకుపోవటానికి?''

''సిగ్గు మీ వాళ్ళకు వుంది కనకా? మీ దగ్గర బాంకుందనా ప్రతినెలా వాళ్ళకు రెండొందలు పంపిస్తున్నారు?''

''మా నాన్నకొచ్చే పెన్షన్ చాలదు కనుక పంపుతున్నాను. అలాగే మీ నాయనకూ చాలదు, ప్రతినెలా రెండొందలు పంపించమంటే నా తిప్పలు నేను పడి పంపిస్తాను. ఇలా ఇరవైవేలు, ముప్పైవేలు అంటే నావల్లకాదు.''

''మీరేం ముష్టి పెట్టక్కరలేదులెండి. మా వాళ్ళేం గతిలేని వాళ్ళుకారు. రేపొద్దునే చెప్పేస్తాను మా తమ్ముడికి, 'మీ బావగారికి డబ్బివ్వటం ఇష్టం లేదు. ఆ తీసుకున్న డబ్బు త్వరగా

పంపించండి' అని'' అంది రేణుక. ఆమె కళ్ళంట నీళ్ళు బొటబొటా కారుతున్నాయి. ఆమె కళ్ళ నీళ్ళు చూడగానే అతని గుండె జారిపోయింది.

''ఇదిగో రేణూ! అట్లా ప్రతిదానికీ పంతం పట్టే ఎట్లా? కాస్త నా పరిస్థితీ అర్థం చేసుకో'' అన్నాడు రామనాథం.

''అవును అందరూ మిమ్మల్నే అర్థం చేసుకోవాలి. మీరు మాత్రం ఎవర్నీ అర్థం చేసుకోరు. నాన్నా, తమ్ముడూ వచ్చి అడిగినప్పుడు 'మాకు మీమీఁద నమ్మకం లేదు. మేం డబ్బివ్వలేం' అని ఏమొహంతో చెప్పుకోవాలి. రేప్పొద్దున ఏ మొహం పెట్టుకుని పుట్టింటికి వెళ్ళాలి? మీకవన్నీ అనవసరం. సంపాదన మీది కాబట్టి మీ ఇష్టమొచ్చిన వాళ్ళకు పెట్టుకుంటారు. సంపాదించని ఆడముండని కాబట్టి మీరేదంటే అది వంతపాడాలి'' అంది రేణుక. వరద ముంపొచ్చినట్టు ధారాపాతంగా కన్నీళ్ళు కారుస్తూ.

''నేను సంపాదిస్తున్నాననీ, నువ్వు సంపాదించడం లేదనీ చిన్నచూపు చూడటంలేదే. నువ్వు ఇంట్లో చేసే పని తక్కువైందనీ, విలువైందికాదనీ అనలేదే. ఎవరి పనులు వాళ్ళు చేస్తున్నాం. సంపాదనకూ, మీ వాళ్ళకు డబ్బివ్వటానికీ లంకె పెట్టకు'' అన్నాడు రామనాథం నొచ్చుకుంటూ.

''నోటితో అనక్కర్లేదు. చేసే చేతలే తెలియబరుస్తాయి మీ ఆలోచనలు.''

''సరే ఇంతకీ ఏమంటావు''

''నేనదేముంది, మీ ఇష్టం వచ్చినట్టు చెయ్యండి.''

''మీ వాళ్ళకాడబ్బు ఇవ్వాలంటావు?''

''మీరేం ఇవ్వక్కర్లేదు, వాళ్ళ తంటాలు వాళ్ళు పడ్తారు.''

''నేను ఆ డబ్బు సమకూర్చటానికి పడే తంటాలకంటే వాళ్ళు తంటాలు పడటం కష్టమనిపిస్తున్నట్టుంది నీకు.''

''నాకెవరు కష్టపడినా కష్టమేననిపిస్తుంది.''

''సరే, రెండు రోజులుండమను. ఆ ఇరవై వేలూ సర్దుతాను.''

''మీరేం బాధపడి ఇవ్వనవసరంలేదు.''

''...... ''

''రేప్పొద్దున మన వాటా లాభం పంపిస్తే, సంతోషంగా వాడుకునేది మీరే, మా పుట్టింటి వాళ్ళు పంపారని అనుకోటానికి వీల్లేదుగా.''

''.......''

''ఎవరికయినా అడగకుండా సాయం చెయ్యటానికి ముందొస్తే చులకనగానే వుంటుంది లేండి

మనమేం చేయలేం, మనవల్లేంకాదు, ఎవరయినా దోవ చూపిస్తే, అనుమానించటం మానవ నైజం.''

''.........''

''నేనేం నగలు కావాలి, చీరెలు కావాలి అని బాధపెడ్తున్నానా? ఏదో నాలుగురాళ్ళు వెనక వేసుకుంటే ఇల్లు కట్టుకోవచ్చు. పిల్లల జీవితమైనా బాగుపడ్తుందని నా తాపత్రయం.''

''.........''

''మా సరోజ పుట్టింటి వాళ్ళు ఇవ్వాల్సిన కట్నం డబ్బు వ్యాపారంలో పెట్టి లాభాలు పంపించటంతో కాదూ వాళ్ళు ఇల్లు కట్టుకుంది? దాని మామగారు కట్నం డబ్బు వియ్యంకుడు ఇవ్వలేదని గునిసి గునిసి చచ్చాడు. ఇస్తే ఏం చేసేవాడు? తన కూతురి పెళ్ళికి వాడుకునేవాడు. ఇవ్వలేదుగనక 'గంతకు తగ్గ బొంత' అని తనకు తూగిన సంబంధం చూసి కూతురి పెళ్ళి చేశాడు. లేకపోతే కొడుకు కట్నండబ్బూ, తన దగ్గరున్నదీ అంతా తగలెట్టి తనకు మించిన సంబంధం చేసేవాడు. ఇహ ఆ మర్నాటినుండి వాళ్ళు అది పెట్టలేదనీ ఇది ఇవ్వలేదనీ పెట్టే పేచీలు, తగాదాలతో కొంప నాశనమయ్యేది.''

రేణుక మాట్లాడుతూనే వుంది. తనకు తెల్సిన వాళ్ళల్లో ఎవరి పుట్టింటి వాళ్ళు ఎవరికి ఎలా సాయం చేశారో, ఆదుకున్నారో, భార్య మాట వినక కొందరు చచ్చు మొగుళ్ళు తమవాళ్ళకు సాయంచేసి ఎలా కొంప గుండం చేసుకున్నారో ఏకరువు పెడ్తూనే వుంది.

భర్త గురక పెట్టటం విన్పించి ఆగిపోయింది రేణుక. నిద్రపోతున్న భర్తవంక తృప్తిగా ఓ సారి చూసి 'ఇంతగా చెప్పి ఆయన్ని ఆమోదింప చేశాను. ఆ వెధవ మాట నిలబెట్టుకుంటాడో లేదో' అనుకుంది ఆమె.

తెల్లవారురుఝామున పాలు తేవటానికి పాలబూత్‌కి వెళ్తూంటే వెంటవచ్చాడు గణపతి. ఇల్లుదాటగానే ''ఒక సిగరెట్టు పీక వుంటే ఇవ్వు బావా! నిన్నటి నుండి నాన్న వెంటవుంటే తాగటం కుదరలేదు. జివ్వా జివ్వు జివ్వుమని పీకుతుంది సిగరెట్టుకోసం'' అన్నాడు గణపతి.

రామనాథం సిగరెట్టుపెట్టె తీసిచ్చాడు.

ఇంటికొచ్చింతర్వాత కాఫీ చప్పరిస్తూ అన్నాడు గణపతి : ''మరీ బావది పిసినారితనం కాకపోతే మిల్క్‌బాయ్‌ని పెట్టుకోకూడదూ, పొద్దున్నే లేచి పాలు తేకపోతే.''

''మీ బావ అంతేరా నాయనా, చెప్పినా వినరు'' అంది రేణుక.

''ఎవరి పని వాళ్ళు చేసుకుంటే తప్పేంటయ్యా? నువ్వు వ్యాపారం కూడా అలాగే ఎవరిమీదో వదిలేస్తున్నట్టున్నావు, హాయిగా కుడుముల గణపతిలా తయారయ్యావు'' అన్నాడు రామనాథం.

''వాడేమంత లావండీ, ఒడ్డూపొడుగూ అదీ చూడముచ్చటగా ఉంటాడు. మీలా గట్టిగా గాలివీస్తే పడేట్టుండాలా?'' అంది రేణుక తమ్ముడికి వత్తాసు పల్కుతూ.

కాఫీ తాగుతూ సోఫాలో బాసిపట్లు వేసుకుని కూర్చున్న ఆదివరాహమూర్తి కూతురితో అన్నాడు ''అమ్మాయి! అల్లుడికి చీర చూపించావా?'' అని.

రేణుక నీలం రంగు ఎరుపు బోర్డరున్న కంచి పట్టుచీర తీసుకొచ్చి చూపించింది, ''బాగుంది కదండీ'' అంది. ఆమె కళ్ళల్లో మెరుపులు మెరుస్తున్నాయి.

''మీ అమ్మ ఒకటే పోరు 'ఇన్నేళ్ళ తరువాత అమ్మాయి ఇంటికెళ్తున్నారు. అదికూడా ఈ మధ్య మనింటికి రాలేదు. మంచి చీర ఏదయినా పట్టుకెళ్ళండి' అని. రెండు మూడొందల్లో ఏదయినా వాయిల్ చీర పట్టుకొద్దామనుకున్నాను. కాని గణపతి పడనీయందే! 'అక్కకు ఎప్పుడు పెట్టినా మంచి చీరెలే పెట్టాలి. పట్టుచీరెలే పెట్టాలి, ఆడబిడ్డలు ఆనందంగా వుంటేనే మన ఇంటికి లక్ష్మి' అని వెయ్యి రూపాయలు పెట్టి ఈచీర తీసుకుందాకా వదల్లేదు. సరే నాకేం, నాకూతురు కట్టుకుంటే నాకానందం కాదా!'' అన్నాడు ఆదివరాహమూర్తి, అల్లుడికి పట్టుచీర కొనటంలోగల కారణాన్ని వివరిస్తూ.

వాళ్ళు ఎంత బలమైన పథకం వేసుకువచ్చారో అర్థమయింది రామనాథంకి. అసలే ప్రతి ఆడపిల్లకీ పుట్టింటి అభిమానం వుంటుంది. రేణుకకు ఆ మోతాదు ఎక్కువ. పట్టుచీర వలలో పడిపోయింది. తాము ఇవ్వబోయే ఈ ఇరవై వేలలో చివరకు దక్కేది ఈ వెయ్యిరూపాయలే అన్న జ్ఞానం నశించింది. ఇప్పుడు తాను వాళ్ళడిగింది ఇవ్వకపోతే ఇల్లు నరకమవుతుంది.

''బావుందండీ, మంచి ఆలోచనతోనే పట్టుచీర పట్టుకొచ్చారు'' అని అనకుండా వుండలేకపోయాడతను.

ఆదివరాహమూర్తికి రామనాథం మాటలు అర్థమయ్యాయి. 'నువ్వెంత గింజుకున్నా ప్రయోజనం లేదోయ్ అల్లుడు పక్షీ!' అన్నట్టు చిరునవ్వు నవ్వాడాయన. రేణుకకు మరోవిధంగా అర్థమయ్యాయా మాటలు.

''మా వాళ్ళెప్పుడు పెట్టినా నాసిరకం చీరెలు పెట్టరు'' అంది చీరెను చూసి మురిసిపోతూ.

''అమ్మా! దీంతో నేను మంచి లాల్చీ కుట్టించుకోవచ్చుకదా. చెల్లెలికి లంగాకూడా వస్తుంది'' అన్నాడు రాజు తల్లితో చీరెను చూస్తూ.

''ఛీ! చక్కటి చీర చెడిపోదూ, సిల్కు లాల్చీ కావాలంటే మీ నాన్ననడిగి కుట్టించుకో'' అంది రేణుక.

''బావా! ఓ టి.వి. అయినా కొనకపోతివి. ఇవాళ షార్జాలో ఇండియా- పాకిస్థాన్ వన్డే ఇంటర్నేషనల్ వుంది'' అన్నాడు గణపతి.

''ఆయనంతేరా! నేనెప్పటినుంచో పోరుపెడ్తూనే వున్నాను. టి.వి. లేకపోవడంవల్ల పరువు పోతోంది అని. వింటేనా?'' అంది రేణుక.

''మరీ పిసినారితనం లేవే అక్కా బావకు. ఆ మధ్య మేం కలర్ టీ.వి. కొన్నాం. క్రికెట్ అంటే ఆసక్తిలేని నాన్నకూడా క్రికెట్ అంటే పడిచచ్చే స్థితిలో కొచ్చాడు. మొన్న ఒలంపియడ్స్! మనం అవి అసలు జీవితంలో చూడగలమా అని. బావా! జీవితంలో సుఖపడాలి. డబ్బు కూడబెట్టినందువల్ల ప్రయోజనం లేదు. డబ్బును మనం సంపాదిస్తాంగాని, డబ్బు మన్ని సంపాదించదుకదా!'' అన్నాడు గణపతి.

'అవున్నాయనా! నీకోసమే డబ్బు కూడ బెడుతున్నాను. మీలా ఇష్టం వచ్చినట్టు డబ్బు తగలెట్టి అప్పుకోసం ఊళ్లమీద పడటం నాకుచేతకాదు' అనుకొని పైకి ఇలా అన్నాడు, ''నిజమేనోయ్! నువ్వేమనుకున్నావో నా గురించి నాకర్థం కావటంలేదు. కూడబెట్టేంత డబ్బేం నేను సంపాదించటం లేదు. అయినా ఇప్పుడు టి.వి. కొంటే పిల్లల చదువు చెడిపోతుందని కొనలేదు.''

''అదో కుంటి సాకురా, ఆయనకసలు డబ్బు ఖర్చుచేయటమిష్టముండదు'' అంది రేణుక.

''అవును. నాకిష్టముండదు. మీ వాళ్ళు డబ్బు పారబోస్తున్నారు'' అన్నాడు రామనాథం మంటగా.

''అలా అనకు అల్లుడూ! అవసరమొచ్చినప్పుడు ఖర్చుపెట్టుకోపోతే మనం సంపాదించేదెందుకు? ఆ మధ్య కాశీకి వెళ్ళివచ్చామా మీ అత్తగారూ, నేనూ. కాశీ సమారాధన చెయ్యాల్సిందే అని పట్టుబట్టిందావిడ. ఏమీ లేదనుకున్నా పదివేలు ఖర్చయిపోయాయి. గణపతి కొడుకు చిన్నవాడేననుకో, స్కూలు దూరంగా వుంది అని గొణుగుతుంటే ఐదువేలు పెట్టి టి.వి.యస్ కొనిచ్చాం'' అన్నాడు ఆదివారాహమూర్తి.

ఆయన మాటలు వింటుంటే చిర్రెత్తుకొచ్చింది రామనాథానికి. 'మీరట్లాడబ్బు తగలెడ్తూ, అప్పు అంటూ నా ప్రాణం తీయటం దేనికి?' అనుకున్నాడు. పైకి, ''దాందేవుంది లేండి, పైడబ్బు వస్తూంటే ఖర్చుపెట్టటానికీ ఎవరికీ కష్టం వుండదు'' అన్నాడు.

''నాన్నా! నాకూ టి.వి.యస్ కొనవూ?'' అనడిగాడు రాజు.

''మనకెక్కడ కుదిర్తుందిరా అబ్బాయి! మీ తాత, మామయ్యలాగా నేను సంపాదిస్తున్నానా! వాళ్ళంటే ఎంతయినా ఖర్చు పెట్టగలరు. పాపం చేతికి ఎముకలేదు'' అన్నాడు రామనాథం.

''బావ మనం అనవసర ఖర్చులు పెడ్తామని ఎద్దేవా చేస్తున్నాడు'' అన్నాడు గణపతి.

''సరే, ఇహ మేం బయలుదేర్తాం అమ్మాయి!'' అన్నాడు ఆదివరాహమూర్తి.

''అదేంటి అప్పుడే వెళ్తానంటారు! రెండ్రోజుల్లో డబ్బు సర్దుతామన్నారు ఆయన'' అంది రేణుక.

''రెండు రోజులంటే కుదరదమ్మాయి! అక్కడ మేం రేపటికల్లా ఇరవైవేలు కట్టకపోతే పరువు నిలవదు'' అన్నాడు ఆదివరాహమూర్తి.

'పోనివ్వండి, పోయే పరువు నిలుస్తుందా' అన్న మాట గొంతువరకు వచ్చింది రామనాథానికి.

''ఎలాగండీ మరీ, ఇవాళ ఎలాగయినా మీరు ఆ డబ్బు సర్ది పంపించాలి నాన్నావాళ్ళకు'' అంది రేణుక.

''ఇప్పటికిప్పుడంటే ఎలా కుదుర్తుందీ?''

''ఆ( ఎందుకు కుదర్దు, బాగానే కుదుర్తుంది. అసలు ప్రయత్నమే చెయ్యకుండా వుంటే ఒళ్ళోవచ్చి వాల్తుందా డబ్బు!'' అంది రేణుక. చీరె ప్రభావం విపరీతంగా పనిచేస్తోంది ఆమెమీద.

''ఇరవైవేలు పుట్టించటానికి అంత కిందమీద పడ్తావేమిటి అల్లుడూ, అదే మా ఊళ్ళోనయితే క్షణాల మీద పుట్టించేవాడిని'' అన్నాడు ఆదివరాహమూర్తి.

'మరి ఇక్కడి కెందుకు తగలడ్డారు. అక్కడే ఆపాటేదో పడకపోయారూ' అనుకున్నాడు రామనాథం. కాని అతనికి తప్పలేదు. స్నానంచేసే ఓపిక కూడా నశించిపోయింది అతనికి. గుడ్డలేసుకుని ఐదుశాతం వడ్డీకి అప్పు ఇచ్చే గురునాథం దగ్గరకు వెళ్లాడు. నసిగినసిగి డబ్బు అప్పు ఇచ్చాడు గురునాథం. ప్రావిడెంటుఫండు లోనుకు అప్లై చేసి ఆ అప్పుతీర్చాలి తాను. వీళ్ళెలాగూ ఇవ్వరు.

అప్పు తెచ్చి ఇరవైవేలూ మామగారి చేతుల్లో పోస్తుంటే కళ్లంట నీళ్ళు తిరగాయి రామనాథానికి. ఎంత కష్టపడితే, ఎన్నేళ్లయితే తీర్తుందో ఈ అప్పు. ''ఇహ నావల్లకాదు. మీరు అప్పు అంటూ మళ్ళీ నావద్దకు రావద్దు'' అన్నాడు రామనాథం బావమరిదితో.

''అదేంటిబావా! ఇది అప్పు కాదు. నా వ్యాపారంలో పావలా వాటా ఇస్తున్నాను నీకు'' అన్నాడు గణపతి.

'ఒరిగాడిదా! నిన్న మూడోవంతన్నావు. ఇవ్వాళ పావలాకు పడిపోయిందా' అనుకున్నాడు రామనాథం.

''అల్లుడూ! నువ్వేం దిగులుపడకు. సంవత్సరంలో నీ పెట్టుబడి నీకు వస్తుంది. ఇహ ఆపైన అంతా లాభమే'' అన్నాడు ఆదివరాహమూర్తి.

''ఆయన అంతేలే నాన్నా! అన్నిటికీ నిరుత్సాహం'' అంది రేణుక.

కరటక దమనకులిద్దరూ ఇంట్లో నుండి బయటపడుతూంటే శనిగ్రహాలు వదిలినంత రిలీఫ్‌గా ఫీలయాడు రామనాథం.

★ ★ ★

అలా వదిలిన శనిగ్రహాలు మళ్ళీ ఇన్నేళ్ళ తర్వాత దాపురించాయి. రేణుకకీ మనసులో కష్టమనిపించినా బయటకనలేదు. ఈసారి తనే వాళ్ళతో డైరెక్టుగా డీల్ చెయ్యదల్చుకున్నాడు రామనాథం.

అంతలో వీధిలో నుండి లోనికడుగుపెడ్తున్న ఆదివరాహమూర్తి, గణపతీ కన్పించారు.

''రాండి, రాండి, అంతా కులాసానా?'' అని ఆహ్వానించాడు రామనాథం.

''ఏదో ఇట్లా:వున్నాం. ఆ కాయితాల మీద సంతకం పెట్టేస్తే వెళ్ళిపోతాం. నర్సాపూర్ బండికి టిక్కెట్లు రిజర్వుచేసుకొచ్చాం'' అన్నాడు ఆదివరాహమూర్తి.

''ఏం కాయితాలు, ఏం సంతకం?'' అనడిగాడు రామనాథం.

''నువ్వు చెప్పలేదటే అక్కా! అదే బావగారూ, చిట్‌ఫండు కంపెనీలో చిట్టీపాడాం. ఓ లక్షరూపాయలొస్తుంది. నువ్వు ష్యూరిటీ సంతకం చెయ్యాలి. పెద్దబావగారు చేస్తానన్నాడు. అలా డబ్బురాంగానే రెండ్రోజుల్లో మీదగ్గర అప్పుతీసుకున్న డబ్బు పంపేస్తాం'' అని వివరించాడు గణపతి.

రామనాథమేమీ మాట్లాడలేదు. ''అంత తొందరేమొచ్చింది నాన్నా! రేపెళ్ళొచ్చుగా?'' అంది రేణుక.

''వీల్లేదే అమ్మడూ! మేం అక్కడ లేకపోతే క్షణం గడవదు'' అన్నాడు ఆదివరాహమూర్తి.

భోజనాలయాయి వక్కపొడి నములుత్తూ, మామగారు పిడికిలి బిగించి సిగరెట్టు దమ్ములాగింతర్వాత అన్నాడు రామనాథం గణపతితో, ''చూడు గణపతీ! చీట్లకు ష్యూరిటీ లుండటం నాకిష్టం లేదు. నువ్వు మరోలా భావించవద్దు. ఈ విషయంలో నేనేం సాయం చెయ్యలేను'' అని.

గణపతి ముఖం మాడిపోయింది. ''ఇంత నిర్మొహమాటంగా చెప్తావనుకోలేదు బావా! నీమీద ఎంతో ఆశపడి వచ్చాను'' అన్నాడు.

''పోన్లేరా. మనూళ్ళో ఆమాత్రం సంతకం పెట్టేవాళ్ళు లేరనా? కాకపోతే కొంత ఆలస్యమవుతుంది. అల్లుడికి అప్పుతీర్చటమూ లేటవుతుంది. ఇష్టంలేనప్పుడు బలవంతమెందుకూ'' అన్నాడు ఆదివరాహమూర్తి ఆశల పాచిక విసుర్తూ.

రామనాథం ఆ స్టేజీ దాటిపోయాడు. రామనాథంకి తెల్సు, సంతకం పెట్టిన మర్నాటి నుండి ఆ చిట్టీ ఇన్‌స్టాల్‌మెంటు తనే కట్టాల్సి వస్తుందని.

రేణుక తమకు వత్తాసుగా ఏం మాట్లాడకపోవటంచూసి, ''అక్కకూడా మామీద నమ్మకం లేదనుకోలేదు'' అన్నాడు గణపతి.

''నమ్మకం లేక కాదు లేవయ్యా! మీ అక్కకూ వుంది, నాకూ వుంది నీమీద నమ్మకం. ష్యూరిటీల మీద సంతకం పెట్టటం నా ప్రిన్సిపుల్స్‌కి విరుద్ధం. అందువల్ల కాదంటున్నాను'' అన్నాడు రామనాథం.

''సరే లేరా! కాదంటున్న వాళ్ళని పట్టుకు ప్రాధేయపడటమెందుకూ'' అని లేచాడు ఆదివరాహమూర్తి.

తండ్రీ తమ్ముడూ వెళ్తూంటే రేణుక : ''నువ్వన్నట్టు వీలుచూసుకుని త్వరగా పంపరా ఆ డబ్బు తమ్ముడూ! మేమూ ఇల్లు కట్టిస్తున్నామూ, డబ్బుకు ఇబ్బందిగా వుంది'' అంది.

''అలాగే లేవే, అయినా బావగారికో సలహా, ఇక ముందయినా జాగ్రత్తగా వుంటాడని. డబ్బు అప్పివ్వటమేకాదు, తిరిగి తీసుకునే తెలివితేటలుకూడా వుండాలి. అలాంటి వాళ్ళే అప్పివ్వాలి. ఏమంటావు నాన్నా?'' అన్నాడు గణపతి.

''అంతేకదరా మరి! వస్తాం అమ్మాయి!'' అని కొడుకు ననుసరించాడు ఆదివరాహమూర్తి.

రేణుక నివ్వెరపోయి చూస్తోంది. పట్టుచీరెల రెపరెపలకు మూసుకుపోయిన కళ్ళిప్పుడే తెరపిడి పడ్తున్నాయామెకు.

'మరి నీకూ ఓ సలహా గణపతీ! ఒక సారి కాకపోతే రెండుసార్లు ఎవర్నయినా ఫూల్ చేయవచ్చు కాని ఎప్పుడూ అందర్నీ ఫూల్ చెయ్యగలనని మాత్రం అనుకోకు' అని అందామని నోటివరకూ వచ్చి మానుకున్నాడు రామనాథం.

'నెలవంక' సాహిత్య వార్షిక సంచిక
1992-93